క్లుప్తంగా

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు బారులు తీరారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడం, శ్రావణ మాసం మొదటి మంగళవారం కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



సునీతకు చెక్కు అందిస్తున్న నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని గుమ్మడవెల్లి తండాకు చెందిన సభావత్ సునీతకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ మంజూరైంది. సునీత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందగా వైద్యఖర్చులకు చాలా ఖర్చు కావడంతో కుటుంబీకులు స్థానిక నాయకుల ద్వారా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సహకారంతో ఆమెకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.60వేలు మంజూరయ్యాయి. మంజూరైన చెక్కును మంగళవారం బీజేపీ సీనియర్ నాయకులు అమరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గౌర ప్రభాకర్ లబ్ధిదారుకు అందజేశారు.

తల్లిపాలే బిడ్డకు రక్ష

మహేశ్వరం సీడీపీఓ శాంతిశ్రీ



తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న సీడీపీఓ, కౌన్సిలర్

తుక్కుగూడ: బాలింతలు చిన్నారులకు తప్పకుండా తల్లిపాలు పట్టించాలని మహేశ్వరం సీడీపీఓ శాంతిశ్రీ సూచించారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి, బాలింతలకు పలు రకాల సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులకు తల్లిపాలు శ్రేష్టమన్నారు. వీటి ద్వారా ఆరోగ్యంతో పాటు, మానసిక పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. బాలింతలు అంగన్‌వాడీ సిబ్బంది అందించే పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వై.శివకుమార్, మున్సిపల్ మేనేజర్ పర్వతాలు, ఏఈ భార్గవ్‌రెడ్డి, సిబ్బంది, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్, మంత్రిని కలిసిన నాయకులు



స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జంగారెడ్డి తదితరులు

కందుకూరు: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు నగరంలోని వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మహేశ్‌గౌడ్, నాయకులు సిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ మండల ప్రత్యేకాధికారిగా కిషన్‌రావు

మొయినాబాద్‌రూరల్: మొయినాబాద్ మండల ప్రత్యేకాధికారిగా కె.కిషన్‌రావు బాధ్యతలు స్వీకరించారు. నెలరోజుల క్రితం ఎంపీపీల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక పాలనలో భాగంగా అప్పటి నుంచి ఇప్పటివరకు మండల ప్రత్యేకాధికారి స్థానం ఖాళీగా ఉంది. ఈ మేరకు ప్రభుత్వం జిల్లా హార్టికల్చర్ అధికారి కె.కిషన్‌రావును మండల ప్రత్యేకాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంధ్య, ఎంపీఓ వేంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

సంక్షేమ పథకాలు.. తప్పని తిప్పలు!

- అమలునకు లబ్ధిదారుల ప్రదక్షిణలు
- అర్హులకు అందని జీరో బిల్లు, గ్యాస్ సబ్సిడీ
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారులు

కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కోసం నేటికీ అర్హులైన లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. విద్యుత్ జీరో బిల్లు, గ్యాస్ సబ్సిడీ పథకం అమలు కాక చాలా మంది అవస్థలు పడుతున్నారు. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు సరిపోలడం లేదు

ప్రజా పాలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు లబ్ధిదారుల నుంచి గృహజ్యోతి, సబ్సిడీపై గ్యాస్, మహాలక్ష్మి తదితర పథకాల కోసం అధికారులు దరఖాస్తులు సేకరించారు. ఆ తర్వాత వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే క్రమంలో కొన్ని తప్పులు దొర్లాయి. లబ్ధిదారుల వివరాల నమోదులో జీరో బిల్లు, గ్యాస్ నంబర్లు కొన్ని నమోదు కాలేదు. దీంతో పెద్ద ఎత్తున కార్యాలయాలకు లబ్ధిదారులు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 15వ తేదీ నుంచి మరోసారి సమస్య పరిష్కరించేలా అధికారులు మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు. అయినా సమస్య యథావిధిగానే కొనసాగుతుంది. నిత్యం 30 నుంచి 50 మందికి పైగా పథకాల అమలునకు సంబంధిత పత్రాల నమోదుకోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. విద్యుత్ జీరో బిల్లులతో పాటు గ్యాస్ కంపెనీల వివరాలు సరిపోలడం లేదని చెబుతున్నారు. హెచ్‌పీ గ్యాస్ కంపెనీకి సంబంధించి దాదాపుగా సగం మంది లబ్ధిదారుల వివరాలు మ్యాచ్ అవుతుండగా, ఇండియన్ గ్యాస్ కంపెనీకి సంబంధించి పది శాతం మాత్రమే మ్యాచ్ అవుతున్నాయి. కొన్ని గ్యాస్ కంపెనీల నంబర్లు పోర్టల్‌లో నమోదు చేసినా నాట్ మ్యాచ్‌డ్ అని చూపుతుంది. విద్యుత్ జీరో బిల్లు గతంలో సిబ్బంది పోర్టల్‌లో వివరాలు నమోదు చేసే సమయంలో పొందుపరచకపోవడంతో ఇప్పుడు వారికి సాధారణ బిల్లే వస్తుంది. దీంతో నిత్యం గ్రామాల నుంచి లబ్ధిదారులు ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన ప్రత్యేక కౌంటర్లలో మళ్లీ దరఖాస్తులు చేసుకుంటున్నారు. పలు మార్లు వెళ్తున్నా వారికి మాత్రం తిప్పలు తప్పడంలేదు. పోర్టల్‌లో వివరాలు అన్‌లాక్ అయితేనే సమస్య పరిష్కారం దొరుకుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పోర్టల్‌లో మరోసారి విద్యుత్ బిల్లుల వివరాలు నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించి, గ్యాస్ నంబర్ల నమోదు సక్రమంగా జరిగేలా చూడాలని కోరుతున్నారు.

జీరో బిల్లు రావడంలేదు



గతేడాది డిసెంబర్‌లో మా గ్రామంలోకి వచ్చిన అధికారులకు ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తు చేశాను. ఇప్పటి వరకు జీరో బిల్లు రాలేదు. అధికారుల వద్దకు వెళ్లినా పని జరగడం లేదు. పోర్టల్‌లో నాట్ మ్యాచ్‌డ్ అంటున్నారు.

– శ్రీనివాస్, చిప్పలపల్లి

మళ్లీ దరఖాస్తు చేశా



జీరో బిల్లు ఇప్పటికీ ఎంపీడీఓ కార్యాలయానికి రెండు సార్లు వచ్చాను. మళ్లీ దరఖాస్తు చేసినా రావడం లేదు. ఎందుకు ఇలా అవుతుందో తెలియడం లేదు. అధికారులు పట్టించుకుని సమస్య పరిష్కరించాలి.

– రాజు, దెబ్బడగూడ

వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి

నాగోలు: వీధి కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలని సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుజాత అన్నారు. మంగళవారం సత్యనగర్‌కాలనీ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ఆమెతో పాటు స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీ సుజాత మాట్లాడుతూ.. కుక్కలు వెంట పడుతున్నప్పుడు పరిగెత్తకూడదని వాటిని రాళ్లతో కొట్టరాదన్నారు. అవి తింటున్నప్పుడు వాటిని భంగం కలిగించడం లాంటివి చేస్తే అవి దాడులకు తెగబడుతాయన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో ఉన్నటువంటి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని చిన్నపిల్లలను బయటకు పంపవద్దని వాటికి తిండి పెట్టడం లాంటివి చేయకూడదన్నారు. కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంటే జీహెచ్‌ఎంసీ అధికారులు, లేదా తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇంటి చుట్టూ పరిసర ప్రాంతంలో శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ రంజిత్, పీఓ విక్రాంత్ రెడ్డి, శానిటైజేషన్ డీఈ నీలిమ, సహదేవ్, ప్రేమ్, సత్యనగర్ కాలనీ సెక్రటరీ రమణ, రవీందర్ రావు, శివరాజ్ పాటిల్, నాయకులు మంచి రాజేష్, గట్టు మహేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీ సుజాత

అక్రమ పార్కింగ్‌పై చర్యలకు వినతి



కార్పొరేటర్ లచ్చిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

ఎల్‌బీనగర్: కాలనీకి వెళ్లకుండా రోడ్డుపై అక్రమ పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వెంటనే అక్రమ పార్కింగ్‌లపై చర్యలు తీసుకోవాలని బాలాజీనగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలోని సౌత్ ఈస్ట్ బేకరీ వద్ద ఉన్న కాలనీ ప్రధాన రహదారిపై వాహనాదారులు అక్రమ పార్కింగ్ చేయడంతో కాలనీ రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు అంతరాయం కలుగుతుందన్నారు. సమీపంలోని వైన్స్‌కు వచ్చేవారు కూడా ఇదే రోడ్డుపైన పార్కింగ్ చేయడం, ఆటోలు, ద్విచక్రవాహనదారులు ఇష్టానుసారంగా నిలుపుతుండటంతో సమస్య ఉత్పన్నమవుతోందని కార్పొరేటర్‌కు వివరించారు. అక్రమ పార్కింగ్ విషయంపై పలుమార్లు ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. అక్రమ పార్కింగ్ విషయంలో ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి కాలనీవాసులకు హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో సందీప్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కృష్ణాగౌడ్, అశోక్‌కుమార్, సత్యనారాయణ ఉన్నారు.

హామీలు అమలు చేయాలని వినతి

షాబాద్: ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ కోరారు. మంగళవారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అపర్ణకు పంచాయతీ కార్మికులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ నెల 8న తేదీన గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలు చెల్లించాలని రాష్ట్ర వ్యాప్తంగా విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శిగా నియమించాలని కోరారు. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దుచేయాలని ప్రభుత్వమే కార్మికుల వేతనాలకు ప్రత్యేక గ్రాండ్ కేటాయించాలన్నారు. పీఆర్సీలో అర్హులుగా గుర్తించాలని తదితర డిమాండ్లతో ఈ నెల 8వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఒక రోజు సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ మండల ఉపాధ్యక్షులు యాదయ్య, లక్ష్మయ్య, చంద్రయ్య, బాల్‌రాజ్ ఉన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ఎల్వర్తి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్‌తో కలిసి ఆయన మొక్కలు నాటి, నీరు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోజురోజుకు పరిశ్రమలు ఎక్కువ కావడంతో అడవులు అంతరించి పోతున్నాయని, దీంతో మానవాళి మనుగడే ప్రశ్నార్థం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి, సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ సతీశ్, ఎంపీడీఓ వెంకయ్య, ఏపీఓ నాగభూషణం, ఏపీఎం భీమయ్య తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటి, నీరు పోస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, డీపీఓ సురేశ్‌మోహన్ తదితరులు

సమస్యల పరిష్కారానికి కృషి

లింగోజిగూడ: డివిజన్‌లో నెలకొన్న సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గ్రీన్‌పార్క్ కాలనీలోని డ్రైనేజీ సమస్యపై స్థానికులు ఫిర్యాదు మేరకు మంగళవారం ఆయన కాలనీవాసులతో కలసి పరిశీలించారు. సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గుడి కూల్చారని ధర్నా



గుడి కూల్చిన ప్రదేశంలో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి కుర్మల్‌గూడలోని జేఎస్‌ఎంఆర్ఎం గృహ సముదాయాల మధ్య గుడి, మసీదు నిర్మించుకున్నారు. గత కొంత కాలంగా వాటి విషయంలో రాద్ధాంతం నడుస్తూ వస్తుంది. సోమవారం రాత్రి గుడిని తొలగించి మసీదు ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు మంగళవారం కూల్చిన చోటే ధర్నా చేశారు. మసీదును ఉంచి గుడిని తొలగించడాన్ని తప్పుపట్టారు. గుడిని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి, సంపత్, ప్రవీణ్, ఎడ్ల శ్రీశైలం, బీజేవైఎం జిల్లా కార్యదర్శి తుంటి భాస్కర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం: జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్లు, అధ్యాపకులు

తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్



మహేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో..



కందుకూరు: నేదునూరులో..

మహేశ్వరం: తెలంగాణ ప్రజల గుండెల్లో ప్రొఫెసర్ జయశంకర్ చిరస్థాయిగా నిలిచిపోతారని మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగి రమేశ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రొఫెసర్ 90వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.చందన, కళాశాల వాణిజ్య శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఇమ్తియాజుద్దీన్ ఫారుఖ్, రాజనీతి శాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్‌కే. జహీదాబేగం, తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ యం.నర్సింహులు, ప్రొఫెసర్లు ఎన్.గోపాల్, డా.శ్రీ హరిరెడ్డి, డా.దయానంద్, శ్రీదేవి, జి.నరేందర్‌రెడ్డి, చెన్నోజి, డా.ఫార్హత్ నజ్నీన్, అధ్యాపకులు కుమార్, రవళిక పలువురు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో చెరగని ముద్ర

తెలంగాణ రాష్ట్ర సాధనకు జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహనీయుడు ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ అని జెడ్పీసీఈఓ సీహెచ్.కృష్ణారెడ్డి పేర్కొ న్నా రు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకుముందు ఆయనతో పాటు అధికారులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజ, ఎంపీఓ రవీందర్‌రెడ్డి, మహిళా సమాఖ్య ఏపీఎం సత్యనారాయణ, ఉపాధి హామీ ఏపీఓ పరిమళ, సూపరింటెండెంట్ పద్మశ్రీ, పంచాయతీ కార్యద ర్శులు, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలో..

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సిబ్బంది మంగళవారం ఆయ న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌శర్మ, ఉపాధ్యాయులు వెంకటేశం, సురేశ్, గ్లోరి, కృష్ణ, కరుణాకర్, కౌసల్య, పీడీ అబ్దుల్లా, డాక్టర్ ఎండీ బషీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం



మహేశ్వరంలో మొక్కలు నాటుతున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, తదితరులు



బడంగ్‌పేట్: గుర్రంగూడలో మేయర్ పారిజాత, అధికారులు

- జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

మహేశ్వరం: మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని జెడ్పీ సీఈఓ సీహెచ్.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మహేశ్వరం, మన్సాన్‌పల్లి గ్రామాల్లో ఆయన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రెండోరోజు మంగళవారం నీటి ట్యాంకులు, కుళాయిలను ఆయన పరిశీలించి నీటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు నీటిని క్లోరినేషన్ చేయాలన్నారు. చుట్టూ ఉన్న పరిసరాలలో నీటి గుంతలు, పెంట కుప్పలు ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీలలో యాంటీ-లార్వా రసాయనాలు పిచికారీ చేయాలన్నారు. ప్రతిరోజు ఫాగింగ్ చేయాలన్నారు. గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో కుక్కల సర్వే చేపట్టాలన్నారు. అంతకుముందు మహేశ్వరం గ్రామంలో మొక్కలు నాటి, మన్సాన్‌పల్లి గ్రామంలో నీటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజ, ఎంపీఓ రవీందర్‌రెడ్డి, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భగీరథ ట్యాంకులు శుభ్రం

బడంగ్‌పేట్: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రెండోరోజు మేయర్ పారిజాత, అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం గుర్రంగూడలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించారు. పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డి, జలమండలి మేనేజర్ ప్రియాంక తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

గుర్రంగూడ 6వ డివిజన్‌లోని శ్రీనివాసపురం కాలనీలో జరుగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను మేయర్ పారిజాత ప్రారంభించారు. ఆమె వెంట బిక్కునాయక్, వినీల్‌గౌడ్, గడ్డం లింగారెడ్డి, కాలనీ వాసులు ఉన్నారు.

రాఘవేంద్రకాలనీలో..

బడంగ్‌పేట్‌లోని 23వ డివిజన్‌లోని రాఘవేంద్రనగర్ కాలనీలో మంగళవారం స్థానిక కార్పొరేటర్ రాళ్లగూడెం సంతోషి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని శానిటేషన్ సిబ్బందితో కలిసి నిర్వహించారు. చెత్తవేస్తున్న ప్రదేశాలను గుర్తించి అక్కడ శుభ్రం చేయించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న కంపచెట్లను తొలగించారు. చెత్తకుప్పలను శుభ్రం చేయించి ఈ ప్రదేశంలో ఎవరూ చెత్త వేయొద్దని కార్పొరేటర్ కాలనీవాసులను కోరారు. చెత్త వేస్తున్న వారిని గుర్తించి జరిమాన విధిస్తామని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి అన్నారు. చెత్త కంపు నుంచి విముక్తి కల్పించిన కార్పొరేటర్‌కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మహేశ్, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల, మంఖాల్, తుక్కుగూడ, సర్దార్‌నగర్, ఇమామ్‌గూడ, దేవేందర్‌నగర్ కాలనీలో మంగళవారం అధికారులు మున్సిపల్ సిబ్బందితో పరిసరాలను శుభ్రం చేయించారు. అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పలు మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, మేనేజర్ పర్వతాలు, ఏఈ కె.భార్గవ్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్, వార్డు అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.